

కోడి పందేల్లో పట్టుబడిన వ్యక్తులు (పాతచిత్రం)

కోడి పందెం.. ప్రాణ గండం

కన్నెపల్లి మండలంలోని మడవెల్లి పంచాయతీ పరిధిలోని బొత్తపల్లి శివారులో గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తారు. శుక్రవారం పందెం నిర్వహించేందుకు కోడి కాలికి కత్తి కడుతుండగా అది ఒక్కసారిగా ఎగరడంతో మధనయ్య మోచేతికి తగిలింది. తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందారు. అనేక సందర్భాల్లో పలువురికి కత్తి తాకి గాయాలపాలైనట్లు తెలుస్తోంది.



వేమనపల్లి మండలం గుయ్యారం గ్రామ శివారులో ఐదు నెలల కిందట కోడి పందేలు నిర్వహిస్తుండగా కోడి కాలుకు ఉన్న కత్తి ఓ వ్యక్తి పొట్టకు తగలడంతో పేగులు బయటకు వచ్చాయి. రెండు నెలలపాటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. ఇలా బయటకు వచ్చిన ప్రమాదాలే కొన్నే.. బయటపడని చిన్న ప్రమాదాలు అనేకం ఉన్నాయని తెలుస్తోంది.

కాసిపేట, కన్నెపల్లి, న్యూస్‌టుడే

జిల్లాలో కోడి పందేలు గుట్టుగా సాగుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని గ్రామాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో అక్కడికి వెళ్లి పాల్గొంటున్నారు. కొందరు సరదా కోసం ఆడితే మరికొందరి ప్రాణాల మీదకు వస్తోంది. ఐదేళ్ల క్రితం కోడి కత్తి తగిలి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మంచిర్యాల జిల్లాలోని కన్నెపల్లి, కాసిపేట, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో పండగల సందర్భాల్లో గుట్టుగా సాగుతోంది.

పెంపకానికి ప్రత్యేక వ్యక్తులు

కోడి పందేల్లో పాల్గొనే కోళ్లను మారుమూల గ్రామాల్లో కొందరు వ్యక్తులు ప్రత్యేకంగా పెంచుతున్నారు. పందేలకు సిద్ధంగా ఉండేలా వీటిని తయారు చేయిస్తారు. పోటీల్లో పాల్గొనే వారికి కోడి లెక్కన ధర నిర్ణయిస్తారు. ఒక పందెం రూ. వేలల్లో నడుస్తోంది. పండగల వేళల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు పోటీల్లో పాల్గొంటారు. పోటీలో గెలిచిన వారికి ఓడిన వారి కోళ్లతో పాటు పందెం కాసిన నగదు అందజేస్తారు.

◆ కోళ్లకు కత్తులు కట్టడానికి ప్రత్యేక వ్యక్తులు ఉంటారు. పందెంలో పోటీపడుతున్న తరుణంలో కోళ్లు ఎగిరి పక్కన ఉన్న వ్యక్తులకు తగిలి ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. చిన్నచిన్న గాయాలైతే ఎవరికి తెలియకుండా జాగ్రత్త పడతారు. కొన్ని సందర్భాల్లో కత్తులు కోసిన ఘటనల్లో మృతి చెందిన వారు సైతం ఉన్నారు. వ్యాపారం లక్షల్లో జరుగుతున్నా పోలీసుల నిఘా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్తు తీగలు, సబ్‌స్టేషన్ల ఏర్పాటు, నివాసాలకు విద్యుత్తు కనెక్షన్లు, అంతర్గత రహదారుల నిర్మాణం, వంతెనల మరమ్మతులు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత నివేదికలు అందించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. జడ్పీ సీఈవో గణపతి, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీటీడీవో గంగారాం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

కలల సౌధం?? చిక్కులు అనేకం

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్

ఇంటి నిర్మాణం ప్రతిఒక్కరి కల.. కొందరు యుక్త వయసులో.. మరికొందరు ఉద్యోగ విరమణ తరువాత కలల సౌధం నిర్మించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం బాగా పెరిగింది. కొత్త జిల్లా కేంద్రాలతోపాటు శివారు ప్రాంతాల్లో వీటిని నిర్మించుకుంటున్నారు. అయితే అనుభవ లేమి నిర్మాణదారులను కష్టాల పాల్జేస్తోంది. నిర్మాణదారులు కష్టాలు, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

నస్పూర్‌లో నివసించే తిరుపతిరెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం తన కొడుకుల సలహా మేరకు పనిచేసిన ప్రాంతంలోనే ఇల్లు కట్టుకోవాలని అనుకున్నారు. భవిష్యత్తులో చిక్కులు వద్దనుకుని డీటీసీపీ లే అవుట్‌లో ఇంటి నిర్మాణానికి బిల్డర్‌ను సంప్రదించారు. నిర్మాణం సగానికిపైగా పూర్తయిన తర్వాత పనులు ముందుకు సాగడం లేదు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 80 శాతం డబ్బులు చెల్లించారు. చేయాల్సిన పనేమో 40 శాతం మేరకు ఉంది. ఇదేమని అడిగితే అప్పటికి, ఇప్పటికీ ధరలు పెరిగాయని, తానే అదనంగా ఖర్చు పెట్టి నష్టపోయానంటూ బిల్డర్ మాట మార్చాడు. అదనంగా మరింత సొమ్ము వెచ్చించి ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి అంచనాలు బాగా పెరిగాయి.

యువ ఉద్యోగి కుమార్ ముందు చూపుతో బ్యాంకు రుణం తీసుకుని మంచిర్యాలలో ఇంటి నిర్మాణం చేపట్టారు. తానే కష్టపడి అన్నీ దగ్గరుండి చూసుకోవాలనుకుని తాపీ మేస్త్రీని మాట్లాడుకున్నారు. తెల్లకాగితంపై ఒప్పందం రాసుకున్నారు. ఎలివేషన్ పనితోపాటు, పిట్టగోడల నిర్మాణం, ఇతర పనుల వద్ద మేస్త్రీ మొరాయించడం మొదలు పెట్టాడు. ఇదేమని అడిగితే తనకు గిట్టుబాటు కాదని, అదనంగా సొమ్ము కావాలన్నాడు. మరొకరిని పెట్టుకుందామంటే తాపీ మేస్త్రీల సంఘం అంగీకరించదు. చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకుని పని పూర్తి చేయించాడు. అదనంగా రూ. 15 లక్షలు ఖర్చయింది. ఎలక్ట్రీషియన్ ఇబ్బడి ముబ్బడిగా రకరకాల వైర్లు తెప్పించి, అవసరం ఉన్న దానికన్నా రెట్టింపు వినియోగించినట్లు కాకి లెక్కలు చెప్పాడు. అందరికీ సంఘాలు ఉన్నాయి. ఇల్లు కట్టుకునే వినియోగదారుడికి ఎలాంటి రక్షణ లేదని బాధితుడు వాపోయారు.

అనుభవలేమితో ఇబ్బందులు

కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారు మిగతా వారి కన్నా కాస్త భిన్నంగా, కొత్తహంగులతో ఉండాలని అనుకోవడం సహజం. కానీ నిర్మాణ సమయంలో చిక్కులు ఎదురై అనేక మంది వివిధ విషయాల్లో ఫిర్యాదులు చేస్తుంటారు. వాటికి సరైన పరిష్కార మార్గాలు లభించడం లేదు. అధిక మొత్తం డబ్బులు వెచ్చించి అప్పులపాలు కావడం లాంటివి జరుగుతున్నాయి. జీవితంలో ఒకసారి మాత్రమే ఇల్లు కట్టుకునేవారు నూటికి 99 శాతం ఉంటారు. ఇల్లు కట్టాలని నిర్ణయించుకున్న వెంటనే దళారులో, తెలిసిన వారో రకరకాల సలహాలు ఇస్తారు. కొందరేమో ఎంతో కొంత డబ్బు ఆదా అవుతుందని సొంతంగా ఇంటిని నిర్మించుకుంటారు. ఇవన్నీ తలనొప్పి వ్యవహారాలు అనుకునే వారు గుత్తేదారు (బిల్డర్)కి అప్పగిస్తున్నారు. వారు ముందు చెప్పేది ఒకటి, తర్వాత చేసేది మరోటి ఉండటంతో పంచాయితీలు, పోలీసులను ఆశ్రయించడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

● ఇల్లు కడితే కష్టాలు.. కట్టిస్తే నష్టాలు..

● సూచనలు పాటిస్తేనే మేలు




మంచిర్యాలలో నిర్మాణంలో ఉన్న భవనాలు

నిపుణులేమంటున్నారంటే..

◆ ఇల్లు కట్టే ముందు అనుభవజ్ఞులను సంప్రదించాలి. ఇంజినీరింగ్ నిపుణుల సలహా మేరకు ముందుగానే నిర్మాణంలో ఏమేం ఇమిడి ఉంటాయనే విషయాన్ని తెలుసుకోవాలి. వాటి ప్రకారం ఒప్పంద పత్రాన్ని నోటరీ సమక్షంలో రాసుకోవాలి.

◆ కొందరు ఆయా సంఘాలు నిర్ణయించిన రేట్‌ను బుక్ రేటు అంటారు. ఇంకొందరు, స్లాబ్‌రేటు (చదరపు అడుగుల లెక్కన) ప్రకారం ధరలు నిర్ణయిస్తారు. ఎలివేషన్‌తో సహా ప్రతీ అంశాన్ని ముందుగానే నిర్ణయించుకుని ఆ ప్రకారం పని చేసేలా ఒప్పందం చేసుకోవాలి.



◆ విద్యుత్తు, ప్లంబింగ్, ఇంటీరియర్, తలుపులు, కిటికీల విషయంలో నిపుణుల సలహా మేరకు నాణ్యమైన వస్తువులను ప్రస్తావించాలి. ఎంత పనికి ఎంత మొత్తం వస్తువులు అవసరం అవుతాయో అంచనా వేయించుకుని ఒప్పంద పత్రంలో రాయించుకోవాలి. అప్పుడే కొంత మేరకు మోసాలు జరగకుండా ఉంటాయి.

◆ వస్తువుల కొనుగోలు సమయంలో నాణ్యతను పాటించే డీలర్లను ఎంపిక చేసుకోవాలి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు చేస్తే, దళారుల కమీషన్ల బాధ తప్పుతుంది.



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌డీఓ

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు తావులేదు

కోటపల్లి, న్యూస్‌టుడే: కూలీలకు కల్పించే ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ కిషన్ అన్నారు. కోటపల్లి మండలంలో గతేడాది చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో చోటుచేసుకున్న లోటుపాట్లపై తనిఖీ బృందాలు సమర్పించిన తుది నివేదికల ఆధారంగా బాధ్యుల నుంచి రికవరీకి ఆదేశించారు. 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం కోటపల్లి రైతువేదికలో నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 31 పంచాయతీల్లో రూ. 5,1,46,700 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో రూ. 4. 83,73,884 కోట్లను కూలీలకు వేతనాల రూపంలో అందించగా రూ. 17,72,917 లక్షలను సామగ్రికి చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత పనుల్లో అధికారుల పర్యవేక్షణలోపం, కొలతల్లో తేడాలు, కూలీల హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు లెక్కింపుల్లో తప్పులు దొర్లడం, పని ప్రదేశాల్లో తేడాలు లాంటి తప్పిదాలు జరిగినట్లు తనిఖీ బృందాలు తుది నివేదికలు సమర్పించగా బాధ్యులపై రూ. 26,116లను పెనాల్టీతో పాటు రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ బాలయ్య, ఈజీఎస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతేరాజు 9లో

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం @ రోడ్లు, భవనాలు, రెవెన్యూ శాఖలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఐబీ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు కదులుతున్నాయి. ఇక్కడ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టనుండగా ఆయా కార్యాలయాలను ఇతర చోట్ల సర్దుబాటు చేస్తున్నారు. ఇక్కడ రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన పలు విభాగాలతో పాటు ఆర్డీఓ కార్యాలయం సైతం కొనసాగుతుండగా ఇప్పటికే ఆర్‌అండ్‌బీని ఎమ్మెల్యే కాంపు కార్యాలయానికి తరలించారు. కొన్నిరోజులుగా ఆయా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖను ఇక్కడికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కిందిభాగంలో కొనసాగుతున్న రోడ్లు, భవనాల శాఖ డీఈ కార్యాలయాన్ని మొదటి అంతస్తుకు మార్చారు. ఆర్డీఓ కార్యాలయాన్ని కిందకు తీసుకొచ్చేందుకు ఆయా గదులు సిద్ధం చేయిస్తున్నారు. సమీకృత మార్కెట్ సముదాయ భవన నిర్మాణం నిలిపివేసి ఇటీవలే కూల్చివేత కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ఈ కార్యాలయాల భవనాలు కూడా కూల్చనుండగా వాటిని ఇలా మరోచోట సర్దుబాటు చేస్తున్నారు.



ఎమ్మెల్యే కాంపు కార్యాలయం ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రోడ్లు, భవనాల శాఖల సూచికలు



ఆర్డీఓ కార్యాలయానికి సిద్ధం చేస్తున్న భవనం



మొదటి అంతస్తుకు తరలించిన ఆర్‌అండ్‌బీ డీఈ కార్యాలయం

జిల్లాకు సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: సీఎం కప్-2024 పోటీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన టార్చ్ ర్యాలీ సోమవారం మంచిర్యాల జిల్లాకు చేరుకుంది. క్రీడాకారులు, ఆయా సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి రాజ్‌వీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక బెల్లంపల్లి చౌరస్తా నుంచి పాలనాధికారి కార్యాలయం వరకు సాగింది. క్రీడాజ్యోతితో పలువురు అధికారులు పరుగుపెట్టారు. అదనపు పాలనాధికారి మోతీలాల్ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, రానున్న ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ ర్యాలీకి డీసీసీ అధ్యక్షురాలు సురేఖ సైతం హాజరై క్రీడాజ్యోతితో పరుగెత్తారు. గుడిపేట బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, డీఎస్పీ నాగేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, క్రీడాప్రాధికారిక సంస్థ డీడీ అలెక్స్, నోడల్ అధికారి మధు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతితో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, పక్కన అదనపు పాలనాధికారి మోతీలాల్ తదితరులు

మీ కన్నీరు తుడిచే పెద్ద కొడుకునవుతా

● ఖానాపూర్ ఎమ్మెల్యే

జన్నారం, న్యూస్‌టుడే: ఒక్కగానొక్క కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి అండగా ఉంటానని, కన్నీరు తుడిచే పెద్ద కొడుకునవుతానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు(35) నెలన్నర క్రితం ఇరాక్‌లో జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుని మృతదేహం కోసం స్వగ్రామంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జన్నారం మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడారు. రాయమల్లు పాస్‌పోర్ట్ కాపీని చరవాణిలో చిత్రీకరించుకున్నారు. త్వరలోనే మృతదేహం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు భవనాలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్, దాముక కరుణాకర్, అజహర్, ఇంధయ్యా, వెంకట్రాజం పాల్గొన్నారు.



పాస్‌పోర్టు కాపీని ఫొటో తీసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



రోడ్డు నంబరు 3లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మూడో నంబరు దారి.. రద్దీగా మారి

బెల్లంపల్లిలో ప్రధాన విపణి అంతా బజార్ ఏరియాలోనే ఉంటుంది. పాతబస్టాండ్ నుంచి కాంటాచౌరస్తా వరకు నిత్యం మార్కెట్ అంతా రద్దీగానే ఉంటుంది. బతుకమ్మ, దసరా పండగల కోసం ప్రజలంతా దుస్తులు, ఇతర వస్తువులు కొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు. వస్త్ర దుకాణాలు అధికంగా రోడ్డు నంబరు 3లో ఉన్నాయి. ఈ గల్లీలో ప్రవేశిస్తే చాలు ఏ వాహనమైనా ఇరుక్కుపోక తప్పదు. ప్రతి వస్త్ర దుకాణం కొనుగోలు దారులతో కిటకిటలాడుతోంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు ప్రవేశమార్గంలో రెండు బారికేడ్లతో పాటు ఇద్దరు పోలీసులను ఇక్కడ బందోబస్తుకు నియమించారు. కార్లతో పాటు ఇతర భారీ వాహనాలను అనుమతించడం లేదు. ప్రజలంతా నడుచుకుంటూ వెళ్లి తమకు కావాల్సిన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వాహనాలు వెళ్లకుండా నిరోధించడంతో ట్రాఫిక్‌కు అవాంతరాలు తొలగిపోయాయి. బెల్లంపల్లి చరిత్రలోనే గల్లీలకు ట్రాఫిక్ నియంత్రణకు ఇలా బారికేడ్లు ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి.

- బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే



వస్త్రాల కొనుగోలు కోసం వచ్చిన ప్రజలు

కొండలా సమస్యలు.. సమావేశంపైనే ఆశలు

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్

సింగరేణి గుర్తింపు సంఘానికి కేంద్ర కార్మికశాఖ నుంచి అధికారికంగా గత నెలలోనే గుర్తింపు పత్రం లభించింది. గుర్తింపు సంఘంతో సమస్యల పరిష్కారానికి సీఎండీ, డైరెక్టర్ (పా) స్థాయిలో నిర్మాణాత్మక సమావేశాలు అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుంది. గుర్తింపు హోదా లభించిన తర్వాత యాజమాన్యం వివిధ పనుల్లో నిమగ్నమై ఉండటం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రితో కలిసి సీఎండీ, ఇతర అధికారులు విదేశీ పర్యటనలో ఉండటంతో నిర్మాణాత్మక సమావేశంపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు. గుర్తింపు సంఘం ప్రతినిధులకు ఈ నెల 16న అధికారికంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఈ నెలాఖరులో సీఎండీ స్థాయిలో నిర్మాణాత్మక సమావేశం ఉంటుందని అంచనా. ఇప్పటి వరకు తమకు యాజమాన్యం నుంచి సమాచారం అందలేదని, త్వరలో తాము ప్రధాన సమస్యలపై ఒక నిర్ణయానికి వచ్చి ప్రాధాన్యక్రమంలో యాజమాన్యం వద్ద ప్రస్తావిస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

● ఈ నెలాఖరులో ఉండే అవకాశం..



కార్మికుల ఆకాంక్షలు ఇవీ..

స్థానికంగా ఏరియా స్థాయిల్లో పరిష్కారం చేయాల్సిన సమస్యలూ అనేకం పెండింగ్‌లో ఉండటంతో కార్మికవర్గం ఇబ్బందులకు గురవుతోంది.

◆ జీఎంల స్థాయిలో ఖాళీగా ఉన్న వివిధ క్యాటగిరిల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి.

◆ శ్రీరాంపూర్ లాంటి ఏరియాలో సొంతిల్లు నిర్మించుకుని వాటిలో నివాసముంటున్న వారు క్వార్టర్లు ఖాళీ చేసినా యాజమాన్యం తీసుకోవడానికి నిరాకరిస్తోంది. వీరికి క్వార్టర్ కేటాయించినందుకు యాజమాన్యం పెర్క్స్ కింద వేతనంలో 7.5 శాతం చొప్పున ఆదాయం కింద చూపి పన్ను విధిస్తోంది. పొందని ఆదాయానికి పన్ను చెల్లించాల్సి వస్తుందని కార్మికులు సంవత్సరాల తరబడి ఆందోళన చెందుతున్నారు.

◆ ఉపరితల జనరల్ మజ్దూర్ల పదోన్నతుల్లో రాజకీయ జోక్యం వల్ల అర్హులను గుర్తించినా వారికి నియామకపత్రాలు ఇవ్వలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి.

◆ కార్మికవాడల్లో రహదారులు, వీధి దీపాల సమస్యలూ పేరుకుపోతున్నాయి.

◆ రహదారులకు మరమ్మతులు చేయాలన్నా డీఎంఎఫ్‌టీ నిధుల కేటాయింపులోనూ రాజకీయ జోక్యం ఉంటోందనే విమర్శలున్నాయి.

పండగ అడ్వాన్సుపైనా..

యాజమాన్యం కార్మికులకు అప్పు కింద చెల్లించిన రూ. 25వేల దసరా పండగ అడ్వాన్సుపై ఆదాయపు పన్ను చెల్లించాల్సి వస్తోందని హెచ్చెమ్మెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ ఆరోపించారు. దీనిపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదాయపు పన్ను శాఖ అదనపు బాదుడు



కొత్తగా సంస్థలో చేరిన ఉద్యోగులు కొందరికి ఆదాయపు పన్ను శాఖ నుంచి అదనపు పన్నులు పడుతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022లో ఉద్యోగంలో చేరిన వారి ఆధార్, పాన్ కార్డులను అనుసంధానం చేయలేదని గతంలోనే పది శాతం పన్ను వసూలు చేశారు. అయినప్పటికీ అదనంగా 20 శాతం పన్ను వసూలు చేస్తూ జరిమానా పేరిట తాఖీదులు ఇస్తున్నారని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు విమర్శించారు. కొత్త కార్మికులు కొందరికి దీనిపై సరైన అవగాహనలేక పన్ను పేరిట దోపిడీకి గురవుతున్నారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? పాతమంచిర్యాలలోని రాళ్లవాగుకు ఇరు పక్కల అప్రోచ్‌రోడ్డుకు ఇరు వైపులా ఏర్పాటు చేసిన ఇనుప పట్టీల (రైలింగ్) పక్కన ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **- రమేష్, పాతమంచిర్యాల**

✔ రాళ్లవాగు వంతెన అప్రోచ్‌రోడ్డుకు ఇరుపక్కల పెరిగిన ముళ్ల పొదలను త్వరలో తొలగించి శుభ్రం చేస్తాం. **- ఉదయ్ కిరణ్, పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జ్ అధికారి**

? పాతమంచిర్యాలలోని జాతీయ రహదారికి ఇరుపక్కల గల ఎస్సీ కాలనీలో వారం రోజులకు ఒకసారి చెత్త సేకరణ వస్తున్నారు. ఇంట్లోనే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. **-శ్రీనివాస్, పాత మంచిర్యాల**

✔ అక్కడ రెండు రోజులకు ఒకసారి చెత్త తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **-ఉదయ్ కిరణ్, మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారి**

భీమిని, న్యూస్‌టుడే:

? భీమిని మండలం పెద్దపేట గ్రామం బారెవాడలో మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలోని మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. **- కాలనీవాసులు**

✔ గ్రామ పంచాయతీలో ప్రస్తుతానికి నిధులు లేవు. ఉన్నతాధికారులకు నివేదించి నిధులు రాగానే సమస్య పరిష్కరిస్తాం. **- అజయ్, పంచాయతీ కార్యదర్శి**

? భీమిని మండలం లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో భీమిని, గ్రామాల మధ్య రోడ్డు చెడిపోయి గుంతలు ఏర్పడ్డాయి. **- గ్రామస్థులు**

✔ ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడతాం. **- రాంచందర్, ఏఈ, తాండూరు సబ్ డివిజన్**

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

? చెన్నూరు మండలంలోని దుగ్నెపల్లి ఎస్సీకాలనీలో మురుగుకాలువ లేకపోవడంతో మురుగునీళ్లు రోడ్డు మీదుగా పారుతున్నాయి. **మల్లయ్య, స్థానికుడు**

✔ ఎస్సీకాలనీలో మురుగుకాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. **- శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శి**

ఉద్యోగం పేరిట మోసగించిన వారిపై కేసు

నెన్నెల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన బూరం సర్వలతను అటెండర్ ఉద్యోగం పేరిట మోసగించిన ఎరుకల బాపు, మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో అటెండర్ ఉద్యోగంను స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇప్పిస్తానని నమ్మించి రూ. 1,36,000 తీసుకున్నారు. సర్వలత తన మెడలో ఉన్న బంగారు గొలుసును విక్రయించి డబ్బు అందజేసింది. జులై 1, 2024 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు అటెండర్‌గా పనిచేశారు. వేతనం రాక పోవడంతో సంబంధిత వ్యక్తులను నిలదీయడంతో పెద్దపల్లికి చెందిన పిడుగు రవీందర్ పేరిట చెక్ ఇచ్చారు. ఆ చెక్కు చెల్లలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎరుకల బాపు, కొంత శ్రీనివాస్, తిరుమలేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉరేసుకొని మహిళ బలవన్మరణం


భీమక్క

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: మండలంలోని చల్లంపేట గ్రామానికి చెందిన జైని భీమక్క(35) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.సతీష్ తెలిపారు. భీమక్కకు ఆదే గ్రామానికి చెందిన జైని రవితో 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు కొంతకాలంగా గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో భర్త రవితో ఆదివారం వాగ్వాదానికి దిగింది. భర్తకు కొట్టిన ఆమె గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. రోజు వారిగానే జరిగిన గొడవగా కుటుంబ సభ్యులు భావించారు. ఎంత సేపటికి ఆమె తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి చూడగా ఉరి వేసుకుని కనిపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

తాండూరు, న్యూస్‌టుడే: గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం తాండూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాండూరు గ్రామానికి చెందిన రాచకొండ లక్ష్మీనారాయణ(38) క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నీలో పాల్గొన్నాడు. అనంతరం మిత్రులతో కలిసి భోజనం చేసే సమయంలో అస్వస్థతగా పడిపోవడంతో అతన్ని వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ప్రవంతి, ఒక కూతురు ఉన్నారు.


లక్ష్మీనారాయణ

గంజాయి విక్రేతల అరెస్టు

తాండూరు, న్యూస్‌టుడే: గంజాయి మొక్కలు పెంచి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్న సంఘటన సోమవారం తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం లింగధరిగూడెం గ్రామానికి చెందిన జయరాం తన ఇంట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడని సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.70 వేల విలువ చేసే 7 గంజాయి మొక్కలు పట్టుబడ్డాయి. జయరాం తాను పండించిన గంజాయిని సుభద్ర కాలనీకి చెందిన జన్నెకొమర సురేష్‌కు విక్రయించగా అతను ఉండే యువకులకు విక్రయిస్తుంటాడు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా

కోటపల్లి, న్యూస్‌టుడే: పేకాట ఆడుతూ పట్టుబడిన కోటపల్లి మండలం పెదిపల్లి గ్రామానికి చెందిన తాండ్ర పోచయ్య అనే జూదరి నిబంధనలు ఉల్లంఘించినందుకు తహసీల్దార్ లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పేకాట ఆడుతూ గతంలో పట్టుబడ్డ సదరు వ్యక్తిని రూ. లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేశారు. అయినప్పటికీ ఇటీవల చేపట్టిన దాడుల్లో మరోసారి పట్టుబడటంతో తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టగా ఈ మేరకు జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

మొక్కలు తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి విస్తరణలో భాగంగా దారి పక్కన ఉన్న చెట్లను కొందరు వ్యక్తులు తొలగించడం ఉద్రిక్తతకు దారి తీసింది. బెల్లంపల్లి మండలంలోని బుధ్యపల్లి గ్రామం నుంచి మందమర్రికి వెళ్లే దారిలో నూతనంగా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రహదారి నిర్మాణంలో భాగంగా బుధ్యపల్లి గ్రామంలోని ఓ రైతు చేనులోని టేకు మొక్కలను తొలగించాలని పలుమార్లు గ్రామస్థులు రైతును కోరారు. ఆయన నిరాకరించడంతో కొందరు వ్యక్తులు రైతు చేనులో టేకు చెట్లను తొలగించారు. దీంతో ఆగ్రహించిన రైతు చేనులో టేకు చెట్లను తొలగించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారని, బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తులపై కేసు

నెన్నెల: మహిపూర్ గ్రామానికి చెందిన శేఖర్, వెంకటస్వామిలపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెల మండల కేంద్రంలో వైన్ షాపు ముందు రహదారికి అడ్డంగా పెట్టిన ద్విచక్ర వాహనాలు తీయాలని శేఖర్ అక్కడున్నవారిని కోరారు. మద్యం మత్తులో ఉన్న తాండూరు మండలానికి చెందిన మద్దు అనిల్, ముద్దాం సాగర్, అస్ప సంజాయి, మరికొంతమంది శేఖర్, వెంకటస్వామిలపై కర్రలతో దాడి చేశారన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలుడి కుటుంబానికి రూ.15 లక్షల నష్టపరిహారం

జైపూర్: టేకుమట్ల గ్రామశివారులోని రైల్వేట్రాక్ పక్కన నీటి గుంటలో పడి చిప్పకుర్తి రాజ్‌కుమార్(14) అనే బాలుడు ఆదివారం మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబానికి నష్టపరిహారంతో పాటు ఎస్టీపీపీలో ఉపాధి కల్పించాలని అతడి బంధువులు, గ్రామస్థులు రాత్రి 11 గంటల వరకు ఆందోళన చేశారు. ఈక్రమంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సోమవారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో మాట్లాడి మృతుడు కుటుంబానికి రూ.15 లక్షల నష్ట పరిహారంతో పాటు ఎస్టీపీపీలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కనికరించండి.. కష్టాలు తీర్చండి

ఏసీసీ, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణ విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులను నుంచి అర్జీలు తీసుకున్నారు.


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

పింఛను, చక్రాల బండి ఇప్పించండి

- వేల్పుల ఐలయ్య, ఆర్‌కే 6 కొత్తరోడ్, శ్రీరాంపూర్

గత ఏడు సంవత్సరాల నుంచి కాళ్లు చేతులు పడిపోవడంతో దివ్యాంగుడిని అయ్యాను. పనిచేసే స్థితిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పింఛను తోపాటు నడవలేని స్థితిలో ఉన్ననాకు మూడు చక్రాల బండిని అందించి ఆదుకోవాలి.



చేపలు పట్టేందుకు అవకాశం ఇవ్వాలి

- మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు, భీమారం

మేము భీమారం గొల్లవాగు ప్రాజెక్టు మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులం. తమకు సభ్యత్వాలు లేవంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు అవకాశం కల్పించండి. భీమారం బస్టాండులో చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలి.



అందని పరిహారం



- ఒడ్నాల సత్తయ్య, పడ్తన్‌పల్లి, హాజీపూర్

ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు కింద మా నానమ్మ ఒడ్నాల మల్లమ్మకు చెందిన భూములను కోల్పోయాం. సంబంధిత నష్టపరిహారం మాకు ఇప్పటి వరకు అందలేదు.

మీ సేవ స్లాట్ బుకింగ్ దొరకట్లేదు..



శ్రీమూర్తి ప్రదీప్, ఊరు శ్రీరాంపూర్,

సదరం దివ్యాంగ ధ్రువీకరణ పత్రం కాలపరిమితి ముగిసి చాలా రోజులవుతుంది. రెన్యువల్ కోసం గత కొన్ని నెలలుగా తిరుగుతున్నా మీ సేవ స్లాట్ బుకింగ్ దొరకట్లేదు. గత 8 నెలలుగా రావాల్సిన పింఛను అందడం లేదు. మీసేవ కేంద్రానికి వెళ్తే ఆన్‌లైన్ పనిచేస్తలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

★ నస్పూర్‌లోని తోళ్లవాగు ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా నాయకుడు నల్ల నాగేంద్రప్రసాద్ కోరారు.

★ మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-24 సంవత్సరంలో జరిగిన పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని బొలిశెట్టి వేణు ఫిర్యాదు చేశారు.

★ తమ భూమికి సంబంధించిన వివరాలు ధరణిలో తప్పుగా నమోదయ్యాయని సవరించాలని కోరుతూ బెల్లంపల్లి మండలం మాల గురిజాలకు ఎందిన దుర్గం సుధీర్ దరఖాస్తు చేశారు.

గృహజ్యోతి పథకం అందించాలి



- కుడిమెత లక్ష్మణ్, జైతుగూడ, దండేపల్లి

గృహజ్యోతి ఉచిత విద్యుత్తు పథకం మాకు అందట్లేదు. గత కొన్ని రోజుల నుంచి స్థానిక మండల కార్యాలయాలకు తిరుగుతున్నా అధికారుల నుంచి సరైన స్పందన లేదు. అర్హులమైన మాకు పథకం అందించి ఆదుకోవాలి.

పోస్టులు భర్తీ చేయరూ..

జిల్లా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నిరుద్యోగుల అసోసియేషన్ సభ్యులు

గత 35 సంవత్సరాలుగా ప్రభుత్వాలు నిర్వహించిన డీఎస్సీ, టీఆర్టీ నియామకాల్లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులు భర్తీ చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1733 ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి.



ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

దండేపల్లి: దండేపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద నిర్వాహకులు సోమవారం చండీహోమం నిర్వహించారు. అనంతరం మండలి నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

కన్నెపల్లి: రెబ్బెన గ్రామంలో దుర్గాదేవి మహా చండీమాత రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి పురపరిధిలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్కేపీ ఓసీలో పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. బిజోన్ రాజీవ్ చౌక్‌లో చండీహోమం నిర్వహించారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని గోదావరి రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జైపూర్: ఇందారం ఐకే-1ఏగనిపై సోమవారం చండీయాగం నిర్వహించారు.


లక్షెట్టిపేటలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


చెన్నూరు అయ్యప్పస్వామి దుర్గాదేవి మండపం వద్ద...


ఆర్కేపీ ఓసీలో.. జీఎం దేవేందర్, , ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఓ గోవిందరావు, ఇతర అధికారులు

ప్లాట్లు.. కొంటే పాట్లే

న్యూస్‌టుడే, దండేపల్లి గ్రామీణం:

రియల్ వ్యాపారులు పంట పొలాలను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొందరు గ్రూపులుగా ఏర్పడి వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తూ నాలా, రెవెన్యూ ఇతర అనుమతులు లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. దీంతో పంచాయతీలకు ఆదాయం కోల్పోవడమే కాకుండా భవిష్యత్తులో వాటిని కొన్నవారికి చిక్కులు వచ్చే ప్రమాదం ఉంది.

దండేపల్లి మండలం కన్నెపల్లి బస్టాండు వద్ద ప్రధాన రహదారి పక్కన పంట పొలాన్ని ప్లాట్లుగా మార్చారు. లే అవుట్ నిబంధనలు పాటించకుండా ప్లాట్లుగా విభజించి గుంటల్లో విక్రయించేందుకు హద్దురాళ్లు పాతారు. ఇదంతా ప్రధాన రహదారి పక్కనే ఉన్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ స్థాయి అధికారి అండతోనే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చారని ఆరోపణలున్నాయి.


కన్నెపల్లి స్టేజీ వద్ద ప్రధాన రహదారి పక్కన ప్లాట్లుగా మార్చి పాతిన హద్దురాళ్లు

ఎకరాల్లో కొని.. గుంటల్లో విక్రయం

కన్నెపల్లిలో ప్లాట్లుగా మార్చిన స్థలాన్ని రియల్ వ్యాపారులు గుంటలుగా విభజించారు. వీటికి హద్దురాళ్లు పాతి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే విక్రయాలు ప్రారంభించినట్లు సమాచారం.

కొరవడిన పర్యవేక్షణ

గ్రామాల్లో లే అవుట్ లేని ప్లాట్లు పుట్టుకొస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం తొలుత వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేయాలి. 33 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్లు, సరిపడా మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలి. విద్యుత్తు స్తంభాలను అమర్చి, నీటి సరఫరా ఏర్పాటు చేయాలి. లే అవుట్ వేసే స్థలంలో పచ్చదనం కోసం మొక్కలు నాటడంతో పాటు 10 శాతం స్థలాన్ని పంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయాలి. లే అవుట్ కోసం పంచాయతీలకు దరఖాస్తు చేసుకుంటే వారు అనుమతిస్తారు

అనుమతులు లేకుంటే చర్యలు

పంట పొలాలను అనుమతులు తీసుకోకుండా ప్లాట్లుగా చేసి విక్రయించడం నేరం. కన్నెపల్లి ప్రధాన రహదారి పక్కన ప్లాట్లుగా విభజించడానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అనుమతి లేకుండా ప్లాట్లుగా విభజిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. **- సంధ్యారాణి, తహసీల్దార్, దండేపల్లి**


బొక్కలగుట్టలో వెండి ఆభరణాల తొడుగులు అందజేస్తున్న సభ్యులు

మైసమ్మ తల్లికి వెండి ఆభరణాల బహూకరణ

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ ఆలయంలోని మైసమ్మ తల్లికి సోమవారం సీహెచ్ శ్రీనివాస్, కుటుంబ సభ్యులు 3 కిలోల వెండి ఆభరణాల తొడుగులు ఆలయ కమిటీకి అందజేశారు. అమ్మవారికి వెండి ఆభరణాల తొడుగులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రవీందర్, మహేష్ పాల్గొన్నారు.

నర్సరీల బాధ్యతల నుంచి తప్పించాలని వినతి

కోటపల్లి: 2024 - 25 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో నిర్వహించే నర్సరీల బాధ్యతలను ఇతరులకు కేటాయించాలని కోరుతూ సోమవారం డీఆర్‌డీఓ కిషన్‌కు కోటపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం సమర్పించారు. దాదాపు 15 నెలల నుంచి పంచాయతీలకు నిధుల కేటాయింపు సక్రమంగా లేకపోవడంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణకు తాము వెచ్చించిన డబ్బులను ఇంత వరకు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

మందమర్రి పట్టణం: మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా రామ్‌లీలా కార్యక్రమానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని సింగరేణి జీఎం దేవేందర్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో మాటాడారు.

ఇజ్రాయెల్ అమెరికా దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్, అమెరికా కూటమి యుద్ధాన్ని ఆపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భారతదేశం ఇజ్రాయెల్‌కు మద్దతు నిలిపి వేయాలని కోరారు. మంచిర్యాలలో సోమవారం ఇజ్రాయెల్, అమెరికా దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు లాల్‌కుమార్, మంగ, కలెందర్ అలీఖాన్, ఖాలీద్, రియాజ్, తన్వీర్, టి.శ్రీనివాస్, ప్రభాకర్, రత్నం తిరుపతి, అరుణ, సురేందర్, సాదిక్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారిణికి బంగారు పతకం

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024లో జిల్లా క్రీడాకారిణి సత్తాచాటింది. సబ్-జూనియర్స్ విభాగంలో రెండ్రోజులుగా హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో మంచిర్యాల పట్టణానికి చెందిన కీర్తి అగర్వాల్ మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఖేలో ఇండియా మంచిర్యాల శిక్షణ కేంద్రంలో శిక్షకుడు రాజు ఆధ్వర్యంలో కీర్తి సాధన చేస్తోంది.




పతకం, ప్రశంసాపత్రంతో కీర్తి అగర్వాల్, శిక్షకుడు రాజు

ఆరోగ్యశాఖ వైద్యశిబిరం

మంచిర్యాల వైద్యవిభాగం, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసింది. 115 మందికి రక్తపరీక్షలు నిర్వహించి, బాధితులకు మందులు అందించింది. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి హరీష్‌రాజ్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. పీఓలు అనిత, అనిల్, కృపాబాయి, వైద్యాధికారి శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నాన్న లేడని.. అధైర్య పడొద్దని...

జన్నారం, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన సేపూరి భూమారెడ్డి ఇటీవల డెంగ్యూ జ్వరంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో శ్రీ గీతా సేవా స్వచ్ఛంద సంస్థ, గ్రామపెద్దలు కలిసి రూ.60వేలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్ చేసి బాండ్ కాగితాన్ని భూమారెడ్డి కుటుంబానికి సోమవారం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. భూమారెడ్డికి భార్య లావణ్య, మూడేళ్లు, ఏడాదిన్నర వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.


భూమారెడ్డి కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న గ్రామస్థులు, సభ్యులు

నవంబరు 6 వరకు ఎమ్మెల్సీ ఓటు హక్కు దరఖాస్తులు

ఏసీసీ: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. నవంబర్ 6 వరకు ప్రత్యేక కేంద్రాలతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో, ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

భూదస్త్రాల తరలింపు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లాకు సంబంధించిన భూకొలతల దస్త్రాలను సోమవారం ఆదిలాబాద్ నుంచి తరలించారు. మండలాలవారీగా ఉన్న దస్త్రాలను మూటలుగా కట్టి జాగ్రత్తగా ప్రత్యేక వాహనంలో పంపించారు. తొలిసారి 1954లో జరిగిన సర్వేకు సంబంధించి దస్త్రాలు ఉన్నాయని, వాటిని జాగ్రత్తగా తరలిస్తున్నట్లు భూకొలతల శాఖ కార్యాలయ దస్త్రాల విభాగాధికారి తిరుమల్‌రెడ్డి పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండల ఛాయాచిత్ర గ్రాహకుల అసోసియేషన్ సభ్యుడు విజ్జిగిరి విజయ్ కొన్ని రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర ఛాయాచిత్ర గ్రాహకుల సంక్షేమ సంఘం ప్రవేశ పెట్టిన కుటుంబ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం అతని కుటుంబీకులకు రూ. 1.60 లక్షల పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్, బెల్లంపల్లి అసోసియేషన్ తరపున రూ.30 వేల నగదును సంఘం సభ్యులు అందజేశారు. సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కనకయ్యగౌడ్, మాజీ కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షులు నల్ల సతీష్‌కుమార్, బెల్లంపల్లి అధ్యక్షులు వేణు, కార్యదర్శి విజయ్, కోశాధికారి విక్రమ్‌చారి పాల్గొన్నారు.


విజయ్ కుటుంబ సభ్యులతో అసోసియేషన్ సభ్యులు

న్యాయం చేయాలని వినతి

భీమిని: ఇటీవల లక్ష్మీపూర్ గ్రామంలో వీధి దీపాలు అమర్చుతుండగా విద్యుదాఘాతంతో రాజ్‌కుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలపాలవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత యువకుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్థులు, బాధితుడి తండ్రి చిలుముల రాములుతో కలిసి సోమవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు.

దసరా ఉత్సవాలకు వివేక్ రూ.50వేల విరాళం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లిలో నిర్వహించే దసరా ఉత్సవాలకు చెన్నూరు ఎమ్మెల్యే రూ.50 వేల విరాళం ప్రకటించారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా రోజు బెల్లంపల్లి తిలక్ క్రీడా మైదానంలో రావణాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ రూ.లక్ష విరాళం అందజేశారు.

రవీందర్‌సింగ్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిద్దాం

జన్నారం, న్యూస్‌టుడే: దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందంజలో ఉంచడంలో కృషి చేసిన రవీందర్‌సింగ్‌ను రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిద్దామని శాతవాహన విశ్వవిద్యాలయం జేఏసీ ఛైర్మన్ చెన్నమల్ల చైతన్య అన్నారు. జన్నారం మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌యూ జేఏసీ నాయకులు శనిగారపు అరుణ్ కుమార్, మహేశ్, గోపతి అన్వేశ్, బోడకుంట రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

కాసిపేట, మందమర్రి పట్టణం- న్యూస్‌టుడే: వన్యప్రాణులను సంరక్షించుకుంటే బుగ్గ అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసుకోవడానికి ఆస్కారం ఉంటుందని డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. ధర్మారావుపేట సెక్షన్ పరిధిలోని బుగ్గగూడెంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బుగ్గ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రత్యేకంగా సీతాకోక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బీట్ అధికారి కుమారస్వామి, పోషం తదితరులున్నారు. మందమర్రి మండలం చిర్రకుంటలో అటవీ శాఖ డిప్యూటీ రేంజి అధికారి కె. గౌరీశంకర్ వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు.


ఆనాటి గురువులతో 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థినులు

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

జన్నారం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. గురువులకు సన్మానం చేశారు. గురువులు రాజం, శకుంతల, విజయ, జయ, కవిత, విజయలక్ష్మి, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాపై అవగాహన

వేమనపల్లి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మంచినీటి సరఫరాపై సహాయకులకు ఏఈ నరేశ్ అవగాహన కల్పించారు.

బహుమతుల అందజేత

మంచిర్యాల పట్టణం: వేంపల్లి గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో వేంపల్లి జట్టు ప్రథమ విజేతగా, దొనబండ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఎస్సై సురేష్ కుమార్ బహుమతులు అందజేశారు.

అయిదు నెలలుగా అందని వేతనాలు

నస్పూర్: పురపాలికలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అయిదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని తెదేపా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తలారి రాజు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని తెదేపా కార్యాలయంలో మాట్లాడారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

కాసిపేట, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండడంతో ఆకు ముడత, కాండం తొలిచే పురుగు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, రైతులు ముందస్తుగానే పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రభాకర్ అన్నారు. మల్కపల్లిలోని వరి పంటలను పరిశీలించారు.

మద్దతు ధర దక్కాలంటే..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

పంటలు చేతికొస్తున్నాయి. క్రయవిక్రయాలు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలి. నాణ్యతను పాటిస్తే మద్దతు ధరను పొందే అవకాశం ఉంది. ధర నిర్ణయంలో తేమకు ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మొదలైన నేపథ్యంలో నాణ్యత, మద్దతు ధరలు పంట విక్రయాలు, కోతలు తదితర వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్కెట్ ఏడీ గజానంద్ సూచనలు చేశారు.



పత్తిలో తేమ నిర్ధారణ ఇలా

కోతలో జాగ్రత్తలు

గిట్టుబాటు ధర రావాలంటే రైతులు కోత దశ నుంచి జాగ్రత్తలు తీసుకుంటే పంట నాణ్యతగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావున పత్తి ఎండపూట ఏరాలి. పత్తిని కుప్పగా వేయడం వల్ల తేమ అందులోనే ఉండి పత్తి చెడిపోవడమే కాకుండా ధర కూడా రాదు. పత్తి ఏరిన తర్వాత ఆరబెట్టి తీసుకొస్తే తేమ తగ్గుతుంది. వరి పైరు కోసిన తరువాత తేమ తగ్గేందుకు పొలంలో కోసిన చోటనే ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ ఒక్కసారిగా తగ్గకూడదు. క్రమక్రమంగా తగ్గాలి. సాధారణమైన ఎండలో పొడిగాలి సన్నగా వస్తున్నప్పుడు ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ శాతం 14-16 శాతం ఉండేట్లు చేయడం వల్ల ధాన్యం ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు. మొక్కజొన్న, సోయా, ఇతర పప్పుదినుసుల పంటలు కోతల తరువాత రెండు, మూడు రోజులు ఆరబెట్టి తరువాత నూర్పిడి చేయాలి. తిరిగి రెండు రోజులు గింజలను ఆరబెడితే తేమ పూర్తిగా తగ్గి గిట్టుబాటు ధర వస్తుంది.

నాణ్యత నిర్ధారణ ఇలా..

పత్తిలో తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారు. 8 శాతం తేమ ఉన్న పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 వస్తుంది. ప్రతి ఒక శాతానికి కిలో ధర తగ్గించి ఇస్తారు. అది కూడా 12 శాతం తేమ వరకే కొనుగోలు చేస్తారు.

- సోయాబీన్‌లో 12 శాతం తేమ లోపు ఉండాలి. చెత్తాచెదారం, పగిలిన గింజలు మూడు శాతం లోపు ఉండాలి.
- మొక్కజొన్నలో 12 శాతం తేమ లోపు ఉండాలి. వేరే పంట పదార్థాలు 0.25-0.75 శాతం వరకు ఉండొచ్చు. దెబ్బతిన్న గింజలు ఒక శాతం లోపు ఉంటే ఫరవాలేదు.
- పప్పుదినుసుల్లో 12 శాతం, ధాన్యంలో 14 శాతం తేమ లోపు ఉండాలి. అంతకంటే తేమ ఎక్కువగా ధరలో కోత విధిస్తారు. ప్రతి పంటలో తేమను నిర్ధారించే పరికరాలు ఉంటాయి. వాటితో తేమ శాతాన్ని పరిశీలించి ధరను నిర్ణయిస్తారు.

రైతేరాజు

రైతు ప్రశ్న | శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్, కీటక శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు : 99085 56659

పత్తి పంటలో కాయకుళ్లు ఆశించింది. నివారణ సూచించండి? - చంద్రశేఖర్, బేల

ఫ్లూపైరాక్సైడ్+ పైరక్లోస్ట్రోబిన్ 0.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కందిలో ఆకులు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. పంటను కాపాడుకోవడం ఎలా? - నాగోరావు, గుడిహత్నూర్

19.19.19 పది గ్రాములు+ఫార్ములా 4 అయిదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

టమాటాను పిన్‌వార్మ్ ఆశించింది. నివారణ సూచించండి? - రవీందర్, మన్నూర్, గుడిహత్నూర్

ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఇండాక్సికార్బ్ 1.75 మి.లీ లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు మందులను మార్చి, మార్చి పిచికారీ చేయాలి.

తక్కువ విస్తీర్ణంలో.. విభిన్న రకాల సాగు

ఏకొద్దిగా చేను ఉన్నా వరి లేదా పత్తి సాగు చేస్తున్న ప్రస్తుత తరుణంలో దండేపల్లికి చెందిన ఎనగందుల భూమయ్య ఉన్న తక్కువ విస్తీర్ణంలోనే విభిన్న రకాల కూరగాయలు, పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనకు 26 గుంటల పొలం ఉండగా ఇందులో వరి సాగు చేస్తున్నారు. ఇంటి సమీపంలో ఉన్న 14 గుంటల్లో ఉన్న పెరటిలో కూరగాయలు, పూల సాగు చేస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో బెండ, వంకాయ, అలసంద తదితర కూరగాయలు సాగు చేస్తారు. వీటిని స్వగ్రామ సంతకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.. చాలా మంది ఇంటికే వచ్చి తీసుకెళ్తుంటారు. పంట చేతికి రాగానే తీసేసి పూలను సాగు చేస్తారు.. గతేడాది సీతమ్మ జడలు, బంతి తదితర పూలు సాగు చేయగా ఈసారి సీతమ్మ జడలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ, దీపావళి తదితర పండగలకు పూలు చేతికొస్తాయి. దీంతో ఆదాయం సమకూరుతుంది. సీజన్ పూర్తి కాగానే తిరిగి కూరగాయలు సాగు చేస్తారు. ఇలా వేసవి పూర్తయ్యే వరకు రెండు సార్లు వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో వరితో పాటు పూలు, కూరగాయలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

- న్యూస్‌టుడే, మందమర్రి వ్యవసాయం



పూలసాగు చేస్తున్న భూమయ్య

నాణ్యమైన నారు కావాలంటే..

కూరగాయలను కాలంతో సంబంధం లేకుండా సాగు చేస్తుంటారు. యాజమాన్య పద్ధతులు పాటించి కూరగాయల నారు పెంచితేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి అనిత పేర్కొన్నారు. పాలీహౌస్, షేడ్ నెట్లలో పెంచితే నాణ్యమైన నారు వస్తుంది. కూరగాయలకు కోకోపిట్ మిశ్రమం టన్నుకు [illegible] కిలో [illegible] నాలు విత్త[illegible] పది రోజులు ముందు కలిపితే నారు కుళ్లు తెగులు నివారించవచ్చు. కిలో విత్తనశుద్ధికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా 1.5 గ్రా. ఉపయోగించాలి. నారు పెరిగే సమయంలో కుళ్లు తెగులు ఆశించకుండా మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

మీకు తెలుసా?

- న్యూస్‌టుడే, దండేపల్లి

చిచ్చర పిడుగులు.. క్రికెట్‌లో వీరులు

- ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక

న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం:



జిల్లా కేంద్రంలోని క్రికెట్ శిక్షణ కేంద్రంలో క్రీడాకారుల సాధన

వ్యక్తిగత క్రీడల్లో రాణించడం.. ఉన్నతస్థాయికి చేరుకోవడం వారి స్వీయ శిక్షణ, సాధనపై ఆధారపడి ఉంటుంది. కానీ గ్రూపుగా తలపడే క్రీడలో చోటు దక్కించుకోవడం అంత సులువేం కాదు. నిత్యం కసరత్తు చేయాలి.. తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలి. మెరుగైన ప్రదర్శనతో సెలక్టర్లను ఆకట్టుకోవాలి. ముఖ్యంగా క్రికెట్ జట్టుకు ఎంపిక అవడమంటే ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. అలాంటి ఈ ఆటలో పదిహేనేళ్లు కూడా నిండని జిల్లాకు చెందిన చిన్నారులు సత్తాచాటుతూ ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్ర స్థాయిలో తలపడేందుకు సిద్ధమవుతున్నారు.

బ్యాటింగ్‌లో మెరిసి.. రాష్ట్ర స్థాయికి చేరి



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న వేములపల్లి లక్ష్మణ్ సాయి బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. కుడిచేతి వాటంతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఇటీవల పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహించిన జిల్లా, జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలిసారి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాటు జట్టులో కీలకమయ్యాడు. గురు అకాడమీలో శిక్షణ పొందుతున్న లక్ష్మణ్ ఆయా పోటీల కోసం ఉదయం, సాయంత్రం కసరత్తు చేస్తున్నాడు.

ఎడమ చేతి వాటం.. ఆల్‌రౌండ్ ప్రతిభ



కొంతకాలంగా మంచిర్యాల పట్టణంలోని అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎడ్ల రిషికేష్‌చంద్ర తన ఎడమచేతి వాటం బ్యాటింగ్, బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. బ్యాటింగ్‌లో చూడచక్కని షాట్లు.. లైన్ అండ్ లెన్త్ బౌలింగ్‌తో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాడు. గతేడాది సైతం ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకోగా ఈ ఏడాది మరింత మెరుగైన ప్రదర్శనతో ఉమ్మడి జిల్లా జట్టును విజయతీరాలకు చేర్చాలని సిద్ధమవుతున్నాడు.

బ్యాటింగ్‌లో ధనాధన్.. కీపింగ్‌లో మెరుపు వేగం



ఓపెనర్‌గా వచ్చిరావడంతోనే తనశైలిలో దంచికొట్టడం పులిపాక వికాస్ సొంతం. బౌలర్ ఎవరైనా, బంతి ఎంత వేగంతో వచ్చినా స్టాండ్స్‌లోకి పంపడమే అతనికి తెలుసు. ఆ ఆటతీరుతోనే జిల్లా, జోనల్ స్థాయిలో సత్తాచాటి తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బ్యాటింగ్‌లో రాణించడమే కాకుండా కీపింగ్‌లోనూ జట్టుకు అదనపు బలం చేకూరుస్తున్నాడు.

తండ్రి శిక్షణ.. మెరుగైన ప్రదర్శన



జిల్లాలోని రామకృష్ణాపూర్ క్రికెట్ జట్టు అంటే బింగి దుర్గాప్రసాద్‌ను గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. తన బ్యాటింగ్‌తో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. విశ్వవిద్యాలయ కెప్టెన్‌గా వ్యవహరించి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అతని అడుగుజాడల్లోనే నడుస్తూ కుమారుడు అర్జున్ రాణిస్తున్నాడు. తండ్రి శిక్షణలోనే మెలకువలు నేర్చుకుంటూ మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నాడు. మరోసారి ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో జట్టులో కీలక సభ్యుడు కాగా అందుకు తగ్గట్లుగా ముమ్మర సాధన చేస్తున్నాడు.



దుబాయ్ స్టేడియంలో బతుకమ్మ ఉత్సవంలో వివిధ జిల్లాల వాసులు



నృత్యం చేస్తున్న మహిళలు, పిల్లలు



బతుకమ్మ ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న డోలు కళాకారులు

ఎడారి నేలపై పూల పండగ

మామడ, మందమర్రి పట్టణం-న్యూస్‌టుడే : ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం(ఈటీసీఏ) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు ఈ కార్యక్రమాన్ని అక్కడి అల్ అహ్లీ ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఘనంగా జరుపుకొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఏటా నిర్వహించే పూలపండగకు ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. బతుకమ్మ ఉత్సవాలు ఆకట్టుకున్నాయని నిర్మల్‌కు చెందిన రాజు, రాజశేఖర్ తెలిపారు. ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, కళాకారులు, సందడి చేసినట్లు జిల్లావాసులు వివరించారు.

పాత పింఛను హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పాత పింఛను విధానాన్ని తీసుకురావాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. జన్నారంలో సోమవారం సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. మేనిఫెస్టోకు అనుకూలంగా జీవోను విడుదల చేసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన ఝార్ఖండ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల్లో పాత ఫించన్ విధానం అమలు చేశారన్నారు. 1.9.2004కు ముందు విడుదలైన ఉద్యోగ ప్రకటన ద్వారా నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్వర్వులు 57/5 ప్రకారం పాత పింఛన్ విధానం అమలుతో ఇతర రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగులకు మేలు జరిగిందని అన్నారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దసరా పండగ కానుకగా పాత పెన్షన్ అమలు చేయాలని ఆయన కోరారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమలికొండ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో మాట్లాడుతున్న సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

ఆమె చేతుల్లో.. అద్భుత కళా నైపుణ్యం

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి చేయాలని ఆలోచించారు ఈ అతివలు. కుట్లు, అల్లికలు కాకుండా భిన్నంగా తమకంటూ ప్రత్యేకత చాటుకొనేలా వస్తువుల తయారీ మార్గాన్ని ఎంచుకొన్నారు. గృహాలంకరణకు ఉపయోపడే వివిధ రకాల వస్తువులు, దేవుళ్ల ప్రతిమలు తయారు చేస్తూ అబ్బురపరుస్తున్నారు.

దూదితో వస్తువుల తయారీలో భాగ్యలక్ష్మి

ఉట్నూరు మండలం లక్కారం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి కిరాణ దుకాణం నడిపించే తన భర్త వట్టంవార్ ప్రసాద్‌కు వ్యాపారంలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఖాళీ సమయంలో ఇంట్లో దూదితో అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. దేవుళ్ల ప్రతిమల అలంకరణ కోసం మాలలు, నల్లపూసల గొలుసులు, నెక్లెస్‌లను తయారు చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో వినూత్న వస్తువులు తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నానని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.



పాడైన వస్తువులు వినియోగంలోకి తెస్తూ..

ఇంద్రవెల్లి మండలానికి చెందిన శశికళ తన భర్త చంద్రబాన్ ప్రోత్సాహంతో పాడైన వస్తువులతో ఆకర్షణీయమైన గాజులను తయారు చేస్తున్నారు. పాడైన వస్తువులను సేకరించి వాటితో ఆకట్టుకొనేలా గాజులు తయారు చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు.



ఆకట్టుకునేలా వస్తువుల అలంకరణలో స్వప్న



ఉట్నూరుకు చెందిన స్వప్న గృహిణి. పండగలు, శుభకార్యాల కోసం పూలు, ఇతర వస్తువులతో ఆకర్షణీయంగా వస్తువులను అలంకరిస్తారు. తన భర్త సునీల్ కుమార్ ప్రోత్సాహంతో వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రుల వేళ దేవుని ప్రతిమలకు సమర్పించే హారతి, లడ్డులు, మహిళలకు వేసే వివిధ రకాల మోహందీ డిజైన్ల అలంకరణ ఆకట్టుకునేలా చేపడుతున్నారు.

ప్రతిమల రూపకల్పనలో నాగమణి

గౌరీ దేవి(గౌరమ్మ), వినాయకుడు, దుర్గాదేవి ఇలా ఏ దేవుళ్ల ప్రతిమ అయినా పసుపు, మైనంతో ఉట్నూరుకు చెందిన నాగమణి తయారు చేస్తున్నారు. భర్త తాటికొండ రమేష్ వ్యాపారస్థుడు. ఆయనకు చేదోడువాదోడుగా ఉంటూనే నాగమణి గాజు ముక్కలతో ఓం, శివలింగం ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు.





ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రం ఏర్పాటు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: పలు జిల్లాల్లోని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత ఉన్నట్లు సమాచారం వస్తుండటంతో సమస్యను పరిష్కరించటానికి ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో సమస్యలను తెలుసుకోవటానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు తాను జిల్లాలో ఆసుపత్రులను పరిశీలించడానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఔషధ నిల్వ కేంద్రాల్లో కొరత ఉన్న మందులను కొనుగోలు చేయటానికి వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇవి జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రిమ్స్‌తో పాటు అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్, ఆర్ఎంఓ తొడ్సం చందు, వైద్యులు తిప్పెస్వామి, సందీప్ జాదవ్ తదితరులున్నారు.



రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చందుల స్వామి తెలిపారు. జూనియర్స్ విభాగంలో వివిధ బరువుల్లో (44-46లో) వి.అక్షయ, (50-53లో) పి.అభినయ, (60-63లో) బి.శ్రావణి వెండి పతకాలు, (44-46లో) ఎం.వైష్ణవి, (46-48లో)ఎన్.జ్యోతి, సబ్ జూనియర్ (35-37లో) కె.నందిని కాంస్య పతకాలు సాధించారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

సంస్కృతికి మకుటం.. సంబరాల పాఠం

- రెండో తరగతి తెలుగు వాచకంలో 'బతుకమ్మ' పాటలు


న్యూస్‌టుడే, కుంటాల : చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువును, సంస్కృతిని నేర్పించాలనే ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. ఈ మేరకు ప్రాథమిక తరగతుల్లోని తెలుగు పాఠ్యపుస్తకాల్లో ఒక్కో తరగతిలో ఒక్కొక్క సంస్కృతి, సంప్రదాయాలు, ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాటలు, పాఠ్యాంశాలు పొందుపరిచారు. 'జాబిలి-2' పేర రూపొందించిన రెండో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో 'బతుకమ్మ' సంబరాలను అయిదు పాఠ్యాంశాలుగా చేర్చారు. విద్యార్థులు పాటలను నేర్చుకోవడంతోపాటు బతుకమ్మ ప్రాముఖ్యం, సంస్కృతిని వంట పట్టించుకున్నారు. బతుకమ్మను పేర్చేందుకు పూలను కోసుకురావడం నుంచి మొదలుకొని బతుకమ్మను పేర్చడం, బతుకమ్మలెత్తుకొని ఊరి మధ్యలోకి తీసుకెళ్లి పెట్టడం, బతుకమ్మలాడటం, నిమజ్జనం చేసే వరకు వరుస క్రమంలో పాఠ్యాంశాలను పొందుపరిచారు.

- తెలుగు వాచకంలో మొదటి పాఠ్యాంశమైన 'రంగురంగుల పూలు'తో బతుకమ్మను పేర్చేందుకు ఉపయోగించే 22 రకాల పూల పేర్లు వచ్చేలా పాటను రూపొందించారు. బతుకమ్మ సంబరంలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా చిన్నారులు, మహిళల అలంకరణను 'ఓణీలు జడకుచ్చులు ఉయ్యాలో, ఒయ్యారమొలకంగ ఉయ్యాలో, బుట్ట బొమ్మలోలే ఉయ్యాలో, బుజ్జిపాపలు కదలి ఉయ్యాలో, అద్దాల రవికలు ఉయ్యాలో, ముత్యాల చీరెలు ఉయ్యాలో, నడుముకూ వడ్డాణం ఉయ్యాలో, నాణ్యమైన నగలు ఉయ్యాలో, నిండైన గాజుల్ల ఉయ్యాలో, బతుకమ్మలెత్తిరి ఉయ్యాలో, నడిచేటి పాదాలు ఉయ్యాలో, నదులను బోలు ఉయ్యాలో.. అంటూ 'బతుకమ్మలెత్తుదాం'లో పేర్కొన్నారు.


- 'నిద్దుర పొమ్మంటు చందమామ, జోలపాటలు పాడి చందమామ, పోయిరా గౌరమ్మ చందమామ, మరలిరావే తల్లి చందమామ..' అంటూ సద్దుల బతుకమ్మ రోజున నిమజ్జనం గురించి 'పోయిరా గౌరమ్మ'లో పొందుపరిచారు. ఇలా.. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా నిలిచిన బతుకమ్మ పండుగపై సంపూర్ణ అవగాహనను పెంచుకున్న చిన్నారులు ప్రస్తుతం నిత్యం ఆయా బస్తీల్లోని చిన్నారులు బతుకమ్మలను పెట్టుకుని ఇవే పాటలను చదువుకుంటూ చిందులేసుకుంటూ సంబరంగా ఆడుకుంటున్నారు.



వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రంగురంగుల పూల పాఠం



బతుకమ్మలెత్తుదాం